తెలంగాణలోనూ ఎమ్మెల్యే కొనుగోళ్లు

- ఇక్కడా పదో షెడ్యూల్ అపహాస్యమే
- కాంగ్రెస్ నేత కపిల్ సిబల్‌కు కేటీఆర్ కౌంటర్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో బీజేపీ తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌ను అపహాస్యం చేస్తున్నదని కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కపిల్ సిబల్ వైఖరి గురువిందగింజ మాదిరిగా ఉన్నదని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. కర్ణాటకలో బీజేపీలానే తెలంగాణలో కాంగ్రెస్ కూడా అదే పని చేస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నదని, సిబల్‌కు ఇది ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలోనూ పదో షెడ్యూల్ అపహాస్యమవుతున్నదని తెలిపారు. పోలీసులు, విజిలెన్స్‌ను అడ్డంపెట్టుకుని అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భారీగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా రాహుల్‌గాంధీ మాత్రం రాజ్యాంగ పరిరక్షకుడిలా ఫోజులు కొడుతుండడం సిగ్గుచేటని విమర్శించారు.కాంగ్రెస్ పాలిత రాష్ర్టాల్లో జరుగుతున్న తప్పులను తొలుత సరిదిద్ది, విమర్శలు చేయాలని కపిల్ సిబల్‌కు కేటీఆర్ హితవు పలికారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

రైతునువంచించాలని చూస్తే కాలం రాగానే రైతు తాను దిగమింగిన దుఃఖం ప్రతాపాన్ని రుచి చూపిస్తాడని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ గడ్డమీద నిలబడి రుణమాఫీ డిక్లరేషన్ ఇచ్చి రైతులను నిండా మోసం చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. రూ.లక్ష రుణమాఫీ కావాలని రైతు బ్యాంకుకు వెళితే లక్ష ఖర్చు అయ్యేలా కేసులు పెడతారా? ఇదేనా ప్రజాపాలన? ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అని ప్రశ్నించారు. అన్నదాతపై పోలీసులు దాష్టీకాలకు పాల్పడితే బీఆర్‌ఎస్ పార్టీ సహించదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పాలకులారా ఖబడ్దార్ అని కేటీఆర్ హెచ్చరించారు.

పండుగలు వస్తున్నయ్.. ఉపాధి పైసలివ్వండి

- 30లోగా యూసీ ఇవ్వకుంటే రెండో విడత నిధులు బంద్
- రాజీవ్ విగ్రహం సాక్షిగా పంచాయతీ చట్టాలు నిర్వీర్యం
- ఆర్థిక సంఘం, ఉపాధి హామీ నిధులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు హరీశ్ లేఖ

> గ్రామ పాలన ఆగిపోయింది. చెత్త సేకరణ నిలిపోయింది. ట్రాక్టర్లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా నిర్వహణ మూలనపడింది. ఫాగింగ్ లేదు. చివరకు బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. దీంతో గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తామే తెచ్చామని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ, మన రాష్ట్రంలో ఈ పథకం అమలులో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నదని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రూ.1,200 కోట్లు విడుదల చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించిన 25% నిధులను విడుదల చేయలేదని మండిపడ్డారు. దసరా, దీపావళి పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కూలీలు, సిబ్బంది పరిస్థితిని అర్థం చేసుకొని, తక్షణం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకానికి సంబంధించి సెప్టెంబర్ 30లోపు యుటిలైజేషన్ సర్టిఫికెట్‌ను కేంద్రానికి సమర్పించకపోతే రెండో విడత నిధుల విడుదల నిలిచిపోతుందని, ఇది తెలంగాణ ప్రయోజనాలను మరింత దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. 15వ ఆర్థిక సంఘం కేటాయించిన పంచాయతీరాజ్ నిధుల విడుదలలో జాప్యం, ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు విడుదలలో ఆలస్యం కారణంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు హరీశ్‌రావు గురువారం బహిరంగ లేఖ రాశారు.

నిలిచిపోయిన గ్రామాల అభివృద్ధి

పంచాయతీరాజ్ చట్టాన్ని తెచ్చామనే గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ నేతలు.. సచివాలయం ముందున్న రాజీవ్‌గాంధీ విగ్రహం సాక్షిగా ఆ చట్టాలను తుంగలో తొక్కడం దారుణమని హరీశ్‌రావు విమర్శించారు. 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేయకపోవడం వల్ల రాష్ట్రంలో గ్రామాభివృద్ధి నిలిచిపోయిందని, పారిశుద్ధ్యం కుంటుపడిందని దుయ్యబట్టారు. గత ఎనిమిది నెలలుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాలుగా మురికికూపాలుగా మారాయని, చెత్తను తొలగించే ట్రాక్టర్లకు డీజిల్ డబ్బులు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని, కొన్నిచోట్ల అధికారులు అప్పులు చేసి డీజిల్ పోయిసున్నారంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా తయారైందో అర్థం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. సొంత జేబు నుంచి డబ్బులు ఖర్చు చెయ్యలేక, ఆ ఆర్థిక భారాన్ని మోయలేక పంచాయతీ కార్యాదర్శులు మూకుమ్మడిగా సెలవులు పెట్టే దుస్థితి దాపురించిందని విమర్శించారు. ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకే కాదు.. పదవీకాలం ముగిసి నాలుగు నెలలైనా సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు సైతం ఎనిమిది నెలల గౌరవ వేతనాలు చెల్లించలేదని దుయ్యబట్టారు. 1వ తేదీనే జీతాలు చెల్లిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలోని మాజీ సర్పంచులు గవర్నర్‌ను కలిసి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మొర పెట్టుకునే పరిస్థితి వచ్చిందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని, గ్రామ పంచాయతీ వ్యవస్థను తిరిగి గాడిన పెట్టేందుకు కృషిచేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్‌లో రాష్ర్టానికి హక్కుగా రావాల్సిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్ పాలన వ్యవసాయానికి సువర్ణ అధ్యాయం

'ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ నంబర్ 1.. పత్తి ఉత్పత్తిలో నంబర్ 3.. పంటల సాగులో మేటి.. మన తెలంగాణ.. దేశానికే ఆదర్శం. ఇదంతా మంత్రమేస్తేనో, మాయ చేస్తేనో జరిగింది కాదు.. తొమ్మిదేండ్ల కేసీఆర్ కృషి, పట్టుదల, విజినరీ లీడర్‌షిప్ వల్ల సాధించిన ఘనత' అని గురువారం ఎక్స్‌వేదికగా హరీశ్‌రావు ట్వీట్ చేశారు. తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ పాలన వ్యవసాయ రంగానికి ఒక సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు.

ఫోన్‌లో కేటీఆర్‌కు కష్టాలు చెప్పుకుంటున్న వికారాబాద్ జిల్లా నారేగూడె రైతు నాగిరెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు

పెద్దాయనా.. ధైర్యంగా ఉండండి

- రుణమాఫీపై మీ తరఫున సర్కారుతో గట్టిగ కొట్లాడ్తం
- ఫోన్‌లో గోడు వెళ్లబోసుకున్న రైతుకు కేటీఆర్ భరోసా

నవాబుపేట, సెప్టెంబర్ 26: 'ఎన్నికల ముందు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తా అన్నడు. గెలిచినంక మాఫీ చేయకుండా తిప్పలు పెడుతుండు. నిలదీద్దామని పట్నమొస్తే.. మమ్మల్ని దొంగల్లాగా ఎస్‌ఆర్‌నగర్ పోలీసుస్టేషన్ల నిర్బంధించిన్రు. కేటీఆర్ గారూ మీరున్నప్పుడు మంచిగుండె.. మీరే మాకు దారి చూపాలి' అంటూ వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం నారేగూడె వాసులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఫోన్‌లో గోడు వెళ్లబోసుకున్నరు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్‌ఎస్ నాయకులతో రుణమాఫీకాని రైతుల సమస్యలు వినేందుకు గురువారం నవాబుపేటమండలం నారేగూడకు వెళ్లారు. ఈ సందర్భంగా రైతులు మల్లారెడ్డి, నాగిరెడ్డి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు. కేటీఆర్ వారికి భరోసా ఇస్తూ 'మీ తరఫున ప్రభుత్వంపై మేము గట్టిగ కొట్లాడ్తం. మీ వెంట కేసీఆర్‌సార్, సబితమ్మ ఉన్నారు' అని ధైర్యం చెప్పారు. 'ఈ గుంపు మేస్త్రి దేవుళ్ల మీద ఒట్టు పెడితే నమ్మినం.ఇంత మోసం చేస్తడనుకుకోలే'అంటూ ఒకరైతు కన్నీరు పెడితే సబితారెడ్డి ధైర్యం చెప్పి ఓదార్చారు.

బీఆర్‌ఎస్ శ్రేణులపై పోలీసుల వేధింపులు

మర్పల్లి : రెండు రోజుల క్రితం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పట్లూరుకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రవీణ్, నవీన్‌లను ఓ కేసు విషయంలో మర్పల్లి పోలీసులు అరెస్టు చేసి వేధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం మాజీ మంత్రి సబితారెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం

- ప్రశ్నిస్తే.. నిర్బంధం.. దాడులా?
- ఇందిరమ్మ రాజ్యం ఇదేనా?
- బీఆర్‌ఎస్ నేత దేవీప్రసాద్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ర్టాన్ని పోలీసు రాజ్యంగా మార్చిందని బీఆర్‌ఎస్ నేత జీ దేవీ ప్రసాద్ విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే నిర్బంధ పాలనేనా అని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని చెప్పిన కాంగ్రెస్ తొమ్మిది నెలలుగా పోలీస్ రాజ్యాన్ని నడిపిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో దేవీప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ద్వారా నిర్బంధం కొనసాగుతున్నదని అన్నారు. కాంగ్రెస్ నిర్బంధాలపై మేధావులు స్పందించాలని కోరారు. ప్రభుత్వ దవాఖానల పరిస్థితిపై ముగ్గురితో కమిటీ వేస్తే వాళ్లను అనుమతించలేదని, ఖమ్మంలో బీఆర్‌ఎస్ నేతలపై రాళ్ల దాడి చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఇంటిపై మరో ఎమ్మెల్యే దాడి చేశారని, ప్రశ్నించే వారిని పోలీస్‌స్టేషన్లకు తిప్పుతున్నారని మండిపడ్డారు. ధర్నాలు చేస్తే రైతులపై కేసులు పెడతామని పోలీసులు బెదిరిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా సిబ్బందిపై అక్రమ కేసులు పెడుతున్నారని, ఇందిరమ్మ రాజ్యం అంటే నిర్బంధ రాజ్యమా? అని నిలదీశారు. పౌరహక్కుల సంఘాల నేతలను అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులకు 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉద్యోగ సంఘాల నేతలను సీఎం తొమ్మిది నెలల నుంచి కలవడం లేదని విమర్శించారు. ఉద్యోగ సంఘాల నాయకుల మధ్య చిచ్చు పెట్టే విధంగా కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత లేదని, హైదరాబాద్ నగరంలో 60 శాతం ప్రజలు నిరాశ్రయులు అవుతారని చెప్పారు. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి సోదరుడికి నోటీసులు ఇచ్చి వదిలేశారని, పేదలపై మాత్రం ఉక్కుపాదం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌కుమార్

బీఆర్‌ఎస్ నేత చిరుమళ్ల రాకేశ్‌కుమార్ మాట్లాడుతూ శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి నేతృత్వంలో తమిళనాడులో బీసీలకు అందుతున్న ప్రయోజనాలపై బీఆర్‌ఎస్ పార్టీ అధ్యయనం చేస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయంలో అమలైన బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని కొనసాగించి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్రచారి, బీఆర్‌ఎస్ నేత గోసుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తెలంగాణలో దేశ్‌ముఖ్‌ల ఆనవాళ్లు

బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ):తెలంగాణలో దేశ్‌ముఖ్ ఆనవాళ్లు మళ్లీ కనిపిస్తున్నాయని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విస్నూరు రామచంద్రారెడ్డి జాగిర్దారీ పాలనకు, రేవంత్‌రెడ్డి పాలనకు తేడాలేదని ధ్వజమెత్తారు.నాడు రామచంద్రారెడ్డిపై పోరాడిన చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో నేడు రేవంత్ సర్కారుపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సహా పలువురు బీఆర్‌ఎస్ నేతలు నివాళ్లర్పించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు టీ రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు జీ దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, చిరుమళ్ల రాకేశ్ కుమార్, కే వాసుదేవ రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్రచారి, బీఆర్‌ఎస్ నాయకులు బొమ్మెర రామ్మూర్తి, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లు

- రాష్ట్రంలో అమలుకు బీఆర్‌ఎస్ పోరాటం
- స్థానిక రిజర్వేషన్లు 42% పెంచేదాకా పోరు
- చెన్నైలో బీఆర్‌ఎస్ నేతల బృందం పర్యటన
- తమిళ బీసీ వెల్ఫేర్ ఉన్నతాధికారులతో సభ్యుల భేటీ
- బీసీల అభ్యున్నతికి కేసీఆర్ అమోఘ కృషి: ఎమ్మెల్సీ మధుసూదనాచారి

తమిళనాడులో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ బీసీ నేతల బృందం సభ్యులు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): తమిళనాడు తరహాలో విద్యా, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లు తెలంగాణలో సాధించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ పోరాడుతుందని ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నేతల బృందం స్పష్టం చేసింది. గురువారం చెన్నైలోని తమిళనాడు బీసీ భవన్‌లో బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులతో బీఆర్‌ఎస్ బృందం సమావేశమైంది. రాష్ట్రంలో రిజర్వేషన్లు, బీసీ అభివృద్ధి పథకాల తీరుతెన్నులను సుదీర్ఘంగా చర్చించింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి విజయకుమార్ సారథ్యంలోని బీసీ సంక్షేమశాఖ అధికారుల బృందం బీసీ రిజర్వేషన్లపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందానికి వివరించారు. బీసీ రిజర్వేషన్లు, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం తమిళనాడులో అమలవుతున్న కార్యక్రమాల అధ్యయనం, తమిళ పార్టీల్లో బహుజనుల ప్రాతినిధ్యం వంటి పలు అంశాలను అధ్యయనం చేసేందుకు శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీ బీసీ నేతల బృందం తమిళనాడులో పర్యటిస్తున్నది. అనంతరం బృందం సభ్యులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ తన పదేండ్ల పాలనలో వివిధ సందర్భాల్లో తమిళనాడు తరహా రిజర్వేషన్లు తమ రాష్ట్రంలో అమలు చేయాలని ప్రధాని మోదీనీ కోరిన విషయాన్ని గుర్తుచేశారు. రాజ్యసభలో బీఆర్‌ఎస్ పక్ష ఉపనేత వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న మాట్లాడుతు తెలంగాణలో స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేదాకా బీఆర్‌ఎస్ పోరాడుతుందని స్పష్టంచేశారు. తమిళనాడులో రిజర్వేషన్ల అమలు విషయంపై బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం ఆరా తీసింది.

ఐలమ్మ స్ఫూర్తితో బీసీ రిజర్వేషన్ల సాధన

తెలంగాణ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితోనే బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పోరాడుతామని బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం సభ్యులు ప్రతినబూనారు. ఐలమ్మ జయంతి సందర్భంగా చెన్నైలో బీఆర్‌ఎస్ నేతలు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించి ఆమె పోరాటాన్ని స్మరించుకున్నారు. ప్రతినిధి బృందంలో శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పుట్టా మధు, కోరుకంటి చందర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు జూలూరు గౌరీశంకర్, డాక్టర్ ఆంజనేయగౌడ్, పల్లె రవికుమార్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాగేందర్‌గౌడ్, రవీంద్రసింగ్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, కిశోర్‌గౌడ్, పార్టీ సీనియర్ నేతలు దాసోజు శ్రీనివాస్, చెరుకు సుధాకర్, రాజ్యలక్ష్మి, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, విద్యార్థి సంఘం నేత దత్తాత్రేయ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నేత ఇంటి వద్ద కాంగ్రెస్ వీరంగం

- దాడికి యత్నించిన అధికార పార్టీ నేత అనుచరులు
- చంపుతామంటూ బెదిరింపులు.. ఇరువురి మధ్య తోపులాట
- మహబూబాబాద్ ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ ఇంటి ఎదుట వీరంగం సృష్టిస్తున్న కాంగ్రెస్ నేత ప్రవీణ్ అనుచరులు

బయ్యారం, సెప్టెంబర్ 26: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు, కస్తూరినగర్ మాజీ సర్పంచ్ కృష్ణకుమారి భర్త మురళీకృష్ణ ఇంటిపై బుధవారం రాత్రి కాంగ్రెస్ గూండాలు దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. మురళీకృష్ణను చంపుతామంటూ ఆయన భార్యను బెదిరించారు. దాడికి తెగబడిన అధికారపార్టీ నేత ప్రవీణ్‌నాయక్ అనుచరులపై బాధితులు గురువారం జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని సీఎంసీ స్థలం ఆక్రమణ విషయమై బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన తెలుపగా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిని నిరసిస్తూ గంధంపల్లి సెంటర్‌లో ఆందోళన చేపట్టడంతో బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంతలో బుధవారం రాత్రి ప్రవీణ్‌నాయక్ అనుచరులు గంధంపల్లి రామాలయం సెంటర్‌లో ఉన్న మురళీకృష్ణ ఇంటికి వెళ్లి వీరంగం సృష్టించారు. ఆయన ఇంట్లో లేడని తెలుసుకొని తన భర్తను చంపుతామంటూ భార్య కృష్ణకుమారిని బెదిరించారు. విషయం తెలుసుకున్న మురళీకృష్ణతోపాటు బీఆర్‌ఎస్ శ్రేణులు అక్కడికి చేరుకోగా ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం, తోపులాట జరిగింది. 100కు కాల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని చెదరగొట్టారు. తన భర్త మురళీకృష్ణకు కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్‌నాయక్, అనుచరులు గోవర్ధన్, మదన్, రాంబాబు, పుల్లయ్యతో ప్రాణ హానీ ఉందని మురళీకృష్ణ భార్య కృషకుమారి బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాత గణేశ్, పలువురు నాయకులతో కలిసి ఎస్పీ రాంనాథ్ కేకన్, డీఎస్పీ తిరుపతిరావుకు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయి విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు. కాంగ్రెస్ గూండాలు మురళీకృష్ణపై దాడికి యత్నించడాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు ఖండించారు.

మరో రెండు రోజులు వర్షాలు

ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీనపడటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వానలు పడే అవకాశమున్నట్టు తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. రాబోయే రెండు రోజుల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని పేర్కొంది. గడిచిన 24 గంటల్లో ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 12.25 సెం.మీ వర్షపా తం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

బీసీలకు వాటా దక్కేదాకా ఉద్యమం

- సమగ్ర కులగణన చేస్తేనే బీసీలకు న్యాయం
- వివిధ పక్షాల, బీసీ సంఘాల నేతల డిమాండ్
- బీసీలంతా ఏకతాటిపైకి రావాలి: ఎమ్మెల్సీ ఎల్ రమణ

బీసీ కులాల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమణ

హిమాయత్‌నగర్, సెప్టెంబర్26: బీసీలకు రాజకీయ వాటా దక్కే వరకు సామాజిక ఉద్యమాన్ని కొనసాగిద్దామని వివిధ పక్షాల నేతలు పిలుపునిచ్చారు. హైదరాబాద్ నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో గురువారం 'బీసీ కులసంఘాల ఐక్యత' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బొల్ల శివశంకర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమగ్ర కుల గణన చేపడితేనే బీసీలకు న్యాయం జరుగుతుందని వక్తలు స్పష్టం చేశారు. బీసీల్లో ఐక్యత కోసం పాటుపడాలని సూచించారు. రాష్ట్రంలోని బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి చట్టసభల్లో రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమించాలని ఎమ్మెల్సీ ఎల్ రమణ పిలుపునిచ్చారు. బీసీల అభివృద్ధి జరిగినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు బీసీ సమాజాన్ని మేల్కొల్పాలని ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. బీసీలు ఐక్యం కాకపోతే రాబోయే రోజుల్లో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. బీసీ కులగణనతో పాటు చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను సాధించడమే తన జీవిత లక్ష్యమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తెలిపారు. తెలంగాణకు చివరి ఓసీ సీఎం రేవంత్‌రెడ్డే అవుతారని, 2028లో జరిగే ఎన్నికల్లో బీసీ సీఎం ఖావడం తథ్యమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పునరుద్ఘాటించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి కోరారు. సమావేశంలో మేధావులు, బీసీ నేతలు బీఎస్ రాములు, గడ్డం జగన్నాథం, అవ్వారి భాస్కర్, వనం దుశ్యంతల, గుజ్జ కృష్ణ, గుంటక రూపా, గుజ్జ సత్యం, బొమ్మ ప్రవళిక, రాకేశ్, బొమ్మ అమరేందర్, బిల్లా దీపిక, గుర్రం శ్రవణ్, వేముల రామకృష్ణ, ఎం భాగ్యలక్ష్మి, కేపీ మురళీకృష్ణ, అనురాధాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై కాంగ్రెస్ దాడి

- మంత్రి దామోదర ఇలాకాలో కార్యకర్తల గూండాగిరి
- రాజకీయంగా ఎదుర్కొలేక బరితెగిస్తున్న అధికార పార్టీ
- ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపుతున్న కాంగ్రెస్ పార్టీ
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శ

జోగిపేటలో యశ్వంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

టేక్మాల్/అందోల్, సెప్టెంబర్ 26: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలోని టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై గురువారం కాంగ్రెస్ పార్టీకి చెందిన సొసైటీ డైరెక్టర్, ఆయన అనుచరుడు దాడికి పాల్పడ్డారు. డైరెక్టర్ అనుచరుడు భూమయ్య సైతం చైర్మన్‌పై దాడికి పాల్పడటంతో నోటి నుంచి తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే బాధితులు టేక్మాల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్‌పై కాంగ్రెస్ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. కోరం లేని కారణంగా అవిశ్వాసం వీగిపోయింది. సొసైటీ చైర్మన్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ జిల్లా సహకార సంఘం అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మెదక్ జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలని మెదక్ ఆర్డీవోను ఆదేశించారు. విచారణ చేపట్టిన ఆర్డీవో కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. టేక్మాల్ సొసైటీ రికార్డులు సక్రమంగా లేవంటూ జిల్లా సొసైటీ అధికారి టేక్మాల్ సీఈవో వేణుగోపాల్‌ను సస్పెండ్ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్‌కు ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలను అప్పగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఫయాజుద్దీన్ సమక్షంలో గురువారం పాలకవర్గ సమావేశం నిర్వహించి కంప్యూటర్ ఆపరేటర్‌కు ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు అప్పగిస్తున్నట్టు తీర్మానం చేశారు. సమావేశం ముగించుకుని చైర్మన్ యశ్వంత్‌రెడ్డి వెళ్లిపోతుండగా మరిన్ని తీర్మానాలు చేయాల్సి ఉందని డైరెక్టర్ పులి సత్యం కోరారు. విచారణ కొనసాగుతున్న సమయంలో తీర్మానం చేయడం సరైంది కాదని, జిల్లా అధికారి అనుమతితో ఇతర అంశాలపై మరోసారి సమావేశంలో తీర్మానం చేద్దామని చెప్పారు. దీంతో అసహనానికి గురైన డైరెక్టర్ పులి సత్యం వ్యక్తిగత దూషణలకు దదిగడంతోపాటు చైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై దాడి చేశాడు. డైరెక్టర్ అనుచరుడు భూమయ్య సైతం చైర్మన్‌పై భౌతిక దాడికి పాల్పడటంతో నోటి నుంచి తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే టేక్మాల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. యశ్వంత్‌రెడ్డిని పోలీసులు చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రశాంతంగా ఉన్న అందోల్‌లో కాంగ్రెస్ పార్టీ ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపిందని, అందులో భాగంగానే టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై దాడి చేసిందని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ దాడిలో గాయపడి జోగిపేట ప్రభుత్వ దవాఖానాలో చికిత్స పొందుతున్న యశ్వంత్‌రెడ్డిని ఆయన పరామర్శించారు.